## తిరుపతి జిల్లాలో 30 పోలీస్ యాక్టు

**-నెలరోజులు సభలు,సమావేశాలు,ఊరేగింపులు,ధర్నాలు రద్దు**



తిరుపతి, మే 31 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు కానిస్టేబుళ్ళ రాత పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రానున్ననెలరోజులు జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ 1861ప్రకారం నిషేధాజ్ఞలు అమలుచేయడమైందని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు.జిల్లా పరిధిలో ప్రజాజీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవడమైంది. జూన్ 31వతేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది. నిషేదాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో జిల్లా పరిధిలో ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసనలు,ధర్నాలు పోలీసు అనుమతిలేకుండా నిర్వహించరాదని, అతిక్రమిస్తే చట్టప్రకారం వారిపై చర్యలు ఉంటాయని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు



చిల్లకూరు, మే 31, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన శ్రీశ్రీశ్రీ ముత్యాల అమ్మవారి దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈఓ నవీన్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 60 రోజులకు గాను హుండీ ద్వారా రూ.28,96,242 ఆదాయం వచ్చినది. అదే విధంగా అమ్మవారికి భక్తులు సమర్పించు చీరలు, రవికలు సేకరించుకోను లైసెన్స్ హక్కులకు గాను వేలంపాట ద్వారా రూ.10,05,000, స్వీట్ అంగడి నిర్వహించుకొను లైసెన్స్ హక్కులకు గాను వేలంపాట ద్వారా రూ.8,35,000లు ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి నవీన్ కుమార్, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, పోలీసు సిబ్బంది, రిటైర్డు బ్యాంకు ఉద్యోగులు, దేవస్థాన సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు.

## స్టార్టర్లు, మోటార్లు వరుస చోరీలు

# తల్లడిల్లుతున్న అన్నదాతలు



శ్రీకాళహస్తిరూరల్,మే 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో అన్నదాతలకు సంబంధించిన వ్యవసాయ మెటార్లు, స్టారర్లు చోరీలతో అన్నదాతలు అల్లాడుతున్నారు. నెల రోజులుగా రెండు మండలాల్లో పదిచోట్ల చోరీలు జరిగాయి.అయితే పోలీసులకు ఫిర్యాదు చేయటం తిరగటం సాధ్యం కాదని రైతులు తమ బాధలు తాము పడుతున్నారు.అయితే జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు ఏర్పేడుపోలీసులకు దిశ దెశ నిర్దేశం చేసారు. దాంతో ఏర్పేడు పోలీసులు ఇద్దరిని అదుపులో తీసుకోగా ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన వారిని అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.ఏర్పేడు మండలంలోని కందాడు,పాగాలి,సరస్వతి కండ్రిగ, ఎండిపుత్తూరు,చెల్లూరులలో వసుగా చోరీలు జరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని మూడు రోజుల క్రితం ముచ్చివోలులో శనివారం అమ్మపాళెం, చెర్లోపల్లి గ్రామాల్లో రైతులకు సంబంధించిన పంటపొలాల్లో ఏర్పాట్లు చేసుకున్న మోటార్లు,స్టార్టర్లు చోరీ జరిగినట్లు రూరల్‌పోలీసులకు ఫిర్యాద చేసారు. ఇక్కడ 35 స్టార్టర్లు చోరీ జరిగినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికిసిఐ రవినాయక్,ఎస్ఐ నరసింహారావు వారి సిబ్బందితో వెళ్ళి పరిశీలించారు. అయితే ఈ దొంగతనాలకు సంబంధించి దొంగలను పట్టుకోవటానికి ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు రవి నాయక్ శనివారం ప్రభాతవార్త అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన పంట పొలాల్లో చోరీలు చేసిన విద్యుత్ వస్తువులను తిరుపతిలో విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలటంతో ఆ దుకాణం దారులను కూడా విచారిస్తున్నట్లు తెలిసింది.

**అసలే అప్పుల వ్యవసాయం . . .**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జీవనది స్వర్ణముఖి పారుతుండటంతో పరివాహక ప్రాంతమంతా కీనీరుగా ఉంటుంది. దాంతోరైతులు ఒరెండు పంటలను రబీ,ఖరీఫ్ సిజన్‌లో ఒక సీజన్లో వరి,మరో సీజన్‌లో కమర్షియల్ పంటలను పండిస్తుంటారు. వ్యవసాయం అంతా చాలా వరకు బావుల మీద ఆదారపడి సాగుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తమ పంట పొలాల వద్ద మోటార్లు,స్టార్టర్లు ఏర్పాటు చేసుకుంటారు. మోటార్లలోని రాగి తీగల కోసం దొంగలు దొంగలించటం జరుగుతుంది. ఒక్కొక్క మోటార్ ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రూ.15 నుంచి 20వేలు కావాలి. అసలే అప్పుల తిప్పలతో వ్యవసాయం సాగిస్తుంటే దొంగలు మోటార్లు దొంగలించుకుపోవటంతో నీటి కోసం తిప్పలు పడుతున్నారు.మళ్ళీ మోటార్లు ఏర్పాటు చేయాలంటే అప్పులు చేయాలి. దానికి కొంత సమయం పడుతుంది.అప్పటి లోపల పంటలు ఎండిపోతాయని తల్లడిల్లుతున్నారు.

# 5న ఏపీ లాసెట్ పరీక్ష

- రాష్ట్ర వ్యాప్తంగా 27,253 మంది ధరఖాస్తు
- 133 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- లాసెట్ కు తొలిసారి ట్రాన్స్ జెండర్ ధరఖాస్తు
- మీడియాతో లాసెట్ చైర్మన్,వీసీ ప్రొఫెసర్ ఉమ



తిరుపతి విద్య, మే 31 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 5వ తేదీన లాసెట్ 2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు లాసెట్ ఛైర్మన్, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు.శనివారం తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే లాసెట్2025కు 27,253మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.గత ఏడాదికి కంటే 4వేలకు పైగా దరఖాస్తులు పెరిగాయని,3ఏళ్ల లా కోర్సుకు పరీక్షకు 19,973మంది, 5ఏళ్ల లా కోర్సుకు 4794 మంది, పీజీ కోర్సుకు 2486 దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు.ఇందులో విశాఖ జిల్లా నుంచి అధికంగా 3384 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా అనకాపల్లి జిల్లా నుంచి 97 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.5న జరిగే పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగ చేయడం జరిగిందన్నారు.విద్యార్థులు ఉదయం 8.30కే పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని,9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలియజేశారు. 6వ తేదీన తాత్కాలిక కీ విడుదల చేసి అభ్యంతరాల స్వీకరణ అనంతరం 18వ తేదీన ఫైనల్ కీ విడుదల చేస్తామన్నారు.అలాగే ఈనెల 22వ తేదీ లాసెట్ పరీక్షా ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో లాసెట్ ఛైర్మన్,వీసీ ప్రొఫెసర్ ఉమ,కన్వీనర్ సీతా కుమారి,పీఆర్ డాక్టర్ ఎన్.శ్రీరజినీ పాల్గొన్నారు.

**- నెల్లూరు నుంచి తొలిసారి ట్రాన్స్ జెండర్ దరఖాస్తు**

ఏపీ లాసెట్ చరిత్రలో తొలిసారి నెల్లూరు నుంచి ఓ ట్రాన్స్ జెండర్ 3 ఏళ్ల కోర్సులో ప్రవేశం పొందేంకు లాసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.17983 మంది పురుష అభ్యర్థులు,9269 మంది మహిళా అభ్యర్థులు లాసెట్ కు ధరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు.

## కాణిపాకం దేవస్థానం గోశాలలో ఈఓ విస్తృత తనిఖీలు



కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈఓ పెంచల కిషోర్ శనివారం దేవస్థానం గోశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈసందర్భంగా గోశాలలోని గోవులకు అందిస్తున్న పశువుల దాణా, పచ్చిగడ్డి, ఎండు గడ్డిలను పరిశీలించారు. అలాగే గోశాలలోని రికార్డులను ఆయన తనిఖీ చేశారు. గోవులకు ఎంత మేత అందిస్తున్నారు? గోవుల ఆరోగ్య పరిస్థితి గురించి గోశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే గోశాలలో పరిశుభ్రతను పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఈఈ వెంకట నారాయణ, గోశాల ఏఈఓ ధనుంజయ, సూపరెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ



తిరుపతి హెల్త్, మే 31 ప్రభాతవార్త ః

ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రపంచ పోగాకు వ్యతిరే దినోత్సవం ర్యాలీ జరిగింది. ఆయన మాట్లాడుతూ పొగ త్రాగడం, గుట్కా సేవించడం, అల్కహాలు తీసుకోవడం వంటి దురలవాట్ల వలన ఊపిరితిత్తులు దెబ్బతినడం, క్యాన్సర్, హృదయ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా యువత దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## శనీశ్వరునికి విశేష పూజలు



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అలాగే అభయ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారాలు జరిపారు. వేసవి సెలవులు పూర్తి కావస్తుండటంతో ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతుంది.ఈ నేపథ్యంలో శనివారం సుమారు పాతిక వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు. శనీశ్వరునికి 104 అభిషేకాలు,స్వామి అమ్మవార్లకు 87 అభిషేకాలు, సాయంత్రం మహాన్యాసపూర్వక ఏకాధశ రుద్రాభిషేకాలు 32 జరిగినట్లు తెలిపారు. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు, ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 8వేల మంది ఉండగా ప్రసాదాలు 22 వేలు అమ్ముడు పోయినట్లు ఇఓ బాపిరెడ్డి తెలిపారు.

## జూన్ 5న 5లక్షల మొక్కలు నాటాలి : కలెక్టర్ పిలుపు



తిరుపతి కలెక్టరేట్, మే 31 ప్రభాతవార్త ః

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 5లక్షల మొక్కలను నాటే మెగా కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయం చేసుకుని పండుగ వాతావరణంలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ జూన్ 5వ తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల పెంపకంపై జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీపీవో సుశీలాదేవి, సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కటు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగం కావచ్చునని తెలియజేశారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఘనత సిఎం చంద్రబాబుదే

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు, మే 31, ప్రభాతవార్త

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రతి నెలా ఒకటో తేదీన పెంచిన పించన్లు పంపిణీ చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వర పురంలో ఆయన పార్టీ నాయకులు, అధికారులతో కలిసి లబ్దిదారులకు పించన్లు పంపిణీ చేశారు. గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వర పురంలో శనివారం పించన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పించన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొని లబ్దిదారులకు పించన్లు అందజేశారు.విఘ్నేశ్వర పురం ప్రాంతానికి చెందిన ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. వీలైనంత త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు పించన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని దివంగత నేత ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. పట్టణ పరిధిలో 5 వేల 365 మందికి, నియోజకవర్గ వ్యాప్తంగా 38 వేల 500 మందికి ప్రతినెలా పించన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్థానికుల సమస్యలను కూడా పరిష్కరిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, ఇశ్రాయిల్ కుమార్, ప్రణీత్ యాదవ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు రెండు పశువులు మృతి



*సత్యవేడు, మే 31 ప్రభాతవార్త:*

*మండలంలోని వెంకటరాజుల కండ్రిగ దళితవాడలో రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. శనివారం ఉదయం కరెంట్‌తీగలు తెగిపడడంతో ఈ సంఘటన చోటు చేసుకున్నట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యపు ద్వారానికి నాందిగా 11కేవీ విద్యుత్ వైర్లు తెగి పడడంతో ప్రమాదవశాత్తు బి.మునికృష్ణయ్య తండ్రి నాగయ్యకి చెందిన రెండు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనిపై ఉన్న అధికారులు దృష్టి సారించి లబ్దిదారు కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.*

## దుప్పిని హతమార్చిన నిందితుడు అరెస్ట్

**- కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్**

**- దుప్పి చర్మం, మాంసం.. నాటు తుపాకీ స్వాధీనం !!**

కుప్పం, మే 31 ప్రభాతవార్త



మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో దుప్పిని హతమార్చిన నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు కుప్పం ఎఫ్ఆర్వో జయశంకర్ తెలిపారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తమకు ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారంతో మల్లప్ప కొండ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా కుప్పం మండలం వాలూరుకు చెందిన కనకరాజు (26) అనే వ్యక్తి సుమారు కిలో దుప్పి మాంసం, ఓ నాటుతుపాకీ, చుక్కల దుప్పి చర్మం, బజాజ్ డిస్కవర్ ద్విచక్రవాహనంతో పట్టుబడ్డాడన్నారు. ఇతను చుక్కల దుప్పిని నాటుతుపాకీతో హతమార్చినట్లు గుర్తించామన్నారు. ఇతనిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, బయో డైవర్సిటీ తదితర చట్టాలను అనుసరించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన దుప్పి మాంసాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని శిక్షలు కఠినంగాఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఆర్వో సమీర్ బాషా, ఎబిఒలు రహ్మాన్, మధు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా బాల కార్మిక నిషేధ చట్టం అమలు

**కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

బాల, కౌవర కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం-1986, సవరణ చట్టం-2016ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన బాల, కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం అమలుపై అధికారులు, స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలలో కలెక్టర్ మాట్లాడుతూ బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం సెక్షన్-3 కింద ఏ వృత్తిలో అయినా, ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాల్లోపు బాలబాలికలతో పని చేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధం అన్నారు. సెక్షన్ 3ఎ కింద 14 సంవత్సరాలు వయస్సు నిండిన 18 సంవత్సరాలు పూర్తి కాని కౌమార వయస్సులో వున్న వారి చేత నిర్ధేశిత ఏ , బి షెడ్యూల్లో పేర్కొన్న నిషేధిత ప్రమాదకర వృత్తుల్లో పని చేయించుకోవడం, లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధమన్నారు. ఈ సెక్షన్లు ఉల్లంఘించిన వారికి 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, 20 వేల నుండి 50 వేల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ఈ చట్టంను సమర్థవంతంగా అమలు చేయడంలో డివిజన్ స్థాయిలో పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయం చేసుకుని బాలకార్మిక వ్యవస్థ ముందుకు వెళ్ళడం ద్వారా సత్‌ఫలితాలు వుంటాయన్నారు. కార్మిక శాఖ మండల స్థాయిలో పోలీసు, రెవెన్యూ సంబంధిత శాఖలను సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహణ చేపట్టడం ద్వారా ఇటుక బట్టీలు, మైనింగ్ పరిశ్రమల వద్ద ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీల వద్ద, డైరీ పరిశ్రమల్లో వున్న బాలకార్మికులను గుర్తించేందుకు అవకాశాలు వుంటాయని ఆ దిశగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖచే బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టంకు సంబంధించి, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరంకు సంబంధించి అవగాహన గోడపత్రికలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణ, సాంఘీక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరీ, రియల్ ఎడ్యుకేషన్, లిటరసీ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు రామారావు తదితరులు పాల్గొన్నారు.



## చెంగారెడ్డికి వైకాపా రాష్ట్ర బాధ్యతలు

పుంగనూరు, మే 31, ప్రభాతవార్త

వై ఎస్సార్ సిపి పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా కొత్తపల్లి చెంగారెడ్డి నియామకమయ్యారు. మండల వైఎస్ఆర్సిపి యువజన నాయకుడు ప్రముఖ పారిశ్రామికవేత చెంగారెడ్డిను వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి. వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి చెంగారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్సీపి యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, మే 31 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరు ఉదయం 9 గంటలకల్లా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



## కుప్పంలో 30 పోలీస్ యాక్ట్ అమలు : డిఎస్పీ

కుప్పం, మే 31 ప్రభాతవార్త

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో కుప్పం సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డిఎస్పీ పార్థసారథి తెలిపారు. జూన్ 1 నుంచి 30వతేది వరకు ఈ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు. కుప్పం అర్బన్ పోలీస్‌స్టేషన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీస్‌స్టేషన్ల పరిధిలో యాక్ట్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా బహిరంగసభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

## విధి నిర్వహణలో మణి సేవలు ప్రశంసనీయం

కుప్పంరూరల్, మే 31 ప్రభాతవార్త



విధి నిర్వహణలో గ్యాంగ్ మజ్దూర్ కె.మణి సేవలు ప్రశంసనీయమని కుప్పం పంచాయతీరాజ్ డిఇ గురవారెడ్డి పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో 34 ఏళ్లు సేవలు అందించిన మణి శనివారం పదవీ విరమణ పొందారు. ఈసందర్భంగా మణి దంపతులను పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో అధికారులు ఘనంగా సత్కరించారు. మణి క్రమశిక్షణతో విధులు నిర్వహించేవారన్నారు. ఆయన శేషజీవితం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో గడపాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఇ శింబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మధు, పిఆర్ సిబ్బంది, సచివాలయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## తెదేపా మహిళా కార్యకర్తలకు దేశం నేతల నివాళులు

రామకుప్పం, మే 31 ప్రభాతవార్త

రామకుప్పంకు చెందిన తెదేపా నేత సజ్జల కోదండరెడ్డి తల్లి మునెమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే శివాజీ నగర్ కాలనీకి చెందిన మహిళా కార్యకర్త లక్ష్మమ్మ మృతి చెందింది. దీంతో లక్ష్మమ్మ కుటుంబానికి సిఎం చంద్రబాబునాయుడు తరపున పదివేల రూపాయలను దేశం నేతలు అందించారు. ఇద్దరు మహిళా కార్యకర్తల మృతి పట్ల ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పట్ర నారాయణ, ఆనందరెడ్డి, రామకృష్ణప్ప, శ్రీరాములురెడ్డి, జయశంకర్, వెంకటరమణ, విజయకుమార్‌రెడ్డి, టివి రవి, పద్మనాభరెడ్డి, గిరిదాసు, సత్తి, ఆదిల్, సురేష్ పాల్గొన్నారు

## నిత్యావసరాలు సక్రమంగా అందించాలి



రామకుప్పం, మే 31 ప్రభాతవార్త

పేదలకు చౌక దుకాణాల ద్వారా అందించే నిత్యావసరాలను డీలర్లు సక్రమంగా అందించాలని నేతలు మునసా ్వమి, ఆనందరెడ్డి సూచించారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, డి.సిఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో వైకాపా పాలనలో గాడి తప్పిన ప్రజా పంపిణీ వ్యవస్థను మరలా పాత పద్ధతిలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతినెలా 1-15 తేదీల్లో ప్రజలకు సరుకులు అందించాలన్నారు. కార్యక్రమంలో చలపతి, సీతాపతి, రఫీ, జయశంకర్, విశ్వనాథ్, వెంకటాచలం, విజయకుమార్‌రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటరమణ, గిరిదాసు, అల్లిశ్రీను, సతీష్, రామలింగారెడ్డి, అవినాష్, మురళీమోహన్, ఆదిల్, నాగరాజు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో దేశం నేతలు పాల్గొన్నారు.

## జడ్పీలో అటెండర్ల బదిలీలు

**చిత్తూరు, జూన్ 31 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్‌లో శనివారం జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు అటెండర్లు, రికార్డు అసిస్టెంట్ల బదిలీలు నిర్వహించి పూర్తి చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలు, మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 18 మంది రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లను కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అనువైన పోస్టింగ్స్‌ను జడ్పీ సిఇఒ రవికుమార్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే ప్రదేశంలో ఐదు సంవత్సరాలు విధులు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తే మరికొంతమందికి రిక్వెస్ట్ మీద బదిలీ చేస్తూ జడ్పీ సిఇఒ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్‌లో సోమవారం నాటికి ఉద్యోగులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ ముగుస్తుందని జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు తెలిపారు.

## పొగాకు రహిత సమాజ ఆవిష్కరణకు కృషి

పాలసముద్రం, మే 31 ప్రభాతవార్త:



పొగాకు రహిత సమాజ ఆవిష్కరణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాలసముద్రం మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బలిజకండ్రిగలో పొగాకు వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను ప్లేకార్డుల్లో ప్రదర్శిస్తూ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఏడాది కాన్సర్ వ్యాధిలో 25 శాతం ప్రజలు మృతి చెందుతున్నారని, ప్రతి ఏడాది అత్యధికులు సిగరెట్ పొగ పీల్చడంతో మృతి చెందుతున్నారన్నారు. పొగాకు వాడకం వల్ల సంతానోత్పత్తి సమస్యలు వచ్చే అవకాశం వుందన్నారు. పొగాకు వ్యాధుల నుండి ప్రజలను విముక్తి కల్పించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 మే 31వ తేదీని ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిన్నరెడ్డప్ప, స్థానిక పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ 19వ జనరల్ బాడీ సమావేశం

తిరుపతి కలెక్టరేట్, మే 31 ప్రభాతవార్త : తిరుపతిలో శనివారం ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ 19వ జనరల్ బాడీ సమావేశం మొట్టమొదటగా ఎన్నికైన రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నీసా భేగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ శ్రీధర్ వితలం, ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీధర్, ఈ ఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్, మానసిక వైద్య నిపుణులు, ఇంపాక్ట్ ప్రెసిడెంట్ ముఖేష్, సెక్రటరీ నాగిరెడ్డి, మునీంద్ర, ఇంపాక్ట్ సభ్యులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా తహసున్నీసా భేగం కొత్తగా రీజియన్ 19వ జనరల్ బాడీ సమావేశాన్ని ప్రారంభించి తన పరిధిలోని ప్రతి క్లబ్‌కి, ప్రతి సభ్యులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలియజేశారు. ఇంపాక్ట్ యొక్క విజన్ కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. తనకు ఈ అవకాశం కల్పించిన గంపా నాగేశ్వరరావుకు, మాదవి, సెక్రటరీ వెంకటరావు, నేషనల్ బాడీకి ధన్యవాదాలు తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.15లక్షల చెక్కులు పంపిణీ

కుప్పం, మే 31 ప్రభాతవార్త



వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 14 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 15లక్షల రూపాయల చెక్కులను శనివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌లు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అర్హులకు సిఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. లబ్దిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, ప్రతాప్, డికెపల్లి మణి, వేలు, సురేష్, హర్ష ధర్మతేజ, కడ సలహామండలి సభ్యురాలు సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కడ సలహామండలి సభ్యుడికి ఘన సన్మానం

కుప్పం, మే 31 ప్రభాతవార్త



కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) పొలిటికల్ సలహామండలి సభ్యుడిగా ప్రభుత్వంచే నియమితుడైన రామచంద్రను శనివారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో ఘనంగా దేశం నేతలు సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడే వారికి పార్టీ తగు గుర్తింపు ఇస్తుందన్నారు. పార్టీలో అందరూ కలసికట్టుగా పనిచేయాలని రాత్రికి రాత్రే నాయకులు కావాలనుకుంటే ఎవరూ కాలేరన్నారు. ప్రజల్లో ఉండేవారికే అధిష్టానం తగు గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు రమేష్, దామోదర్, విభూషణ్, వెంకటాచలపతి, అన్నాదొరై, వెంకటప్ప, జయప్రకాష్, వెంకటేష్, రాజా, నాగార్జున, సాము, రాజ్‌కుమార్, కుట్టు, బాబు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో జోరుగా సామాజిక పెన్షన్ల పంపిణీ

కుప్పంరూరల్, మే 31 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అందించే ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్లను శనివారం గ్రామాల్లో దేశం నేతలు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పంపిణీ చేశారు. జూన్1 వతేది ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ప్రభుత్వం పెన్షన్ల పంపిణీకి చర్యలు చేపట్టింది. మల్లానూరులో మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్యలక్ష్మి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వరసిద్ధుని దర్శించుకున్న మాడుగుల ఎమ్మెల్యే

కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:



విశాఖ జిల్లా మాడుగుల శాసనసభ్యులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ కుటుంబసమేతంగా శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వా మి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరంశ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహిం చారు. వారి వెంట సూపరెండెంట్‌లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, మే 31 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవ స్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమే రకు రొంపిచెర్లకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి అనే భక్తుడు ఈపథకానికి 1,01.116 విరాళంగా అందజేశారు. ఈమొతాన్ని దాతలు కుటుంబ సభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఆలయసూపరెడెంట్ కోదండపాణి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి కేరాఫ్ చంద్రబాబు

చిత్తూరురూరల్, మే 31 ప్రభాతవార్త:



యావత్ ప్రపంచంలోని రాష్ట్రాల అభివృద్ధిలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను ఆంధ్రరాష్ట్రంలో అమలు పరుస్తూ రాష్ట్ర అభివృద్ధికి కేరాఫ్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారని 32వ డివిజన్ నాయకు రాలు, ఏపి బిసి సంక్షేమ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమావతి పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మో హన్ ఆదేశాలతో నగరపాలకసంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ పర్యవేక్షణలో పెన్షన్లను లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి అందిస్తున్నామని, 32వ డివిజన్‌లో ప్రతినెల మొదటి రోజే 90శాతం పెన్షన్లను లబ్దిదారులకు అందజేయడంతో లబ్దిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, మహిళా పోలీస్ తేజ, వార్డు కార్యదర్శులు కిషోర్, మోహన్, రెడ్డిప్రసాద్, షాహినూర్, హారిక, దుర్గ పాల్గొన్నారు.

## బాధ్యతలు గుర్తించడమే యువత బాధ్యత

పుంగనూరు రూరల్, మే 31, ప్రభాతవార్త

గూడూరు పల్లె టిడ్కో హౌస్ సమీపంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైం కంట్రోల్ ఆధ్వర్యంలో



రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం లో దాతలు సుమారు ఇరవైమంది రక్త దానం చేసారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ చైర్మన్ మాదేశ్ మాట్లాడుతూ మహిళాల రక్షణ కోసం ఫోక్స్ యాక్ట్ చట్టం పై అవగాహన, ప్రజల్లో నేర చరిత్రను అరికట్టాలని, యువత బెట్టింగ్ యాప్, ఆన్ లైన్ మోసలకు గురి అవకుండా కాపాడడానికి ఈ సంస్థ పనిచేస్తున్నాదన్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ఏ సల్మాని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ అండ్ స్టేట్, డిస్ట్రిక్ట్, పుంగనూరు టీమ్ మెంబెర్‌లు అన్సర్, జాఫర్, సమివుల్లా, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ ఖాళీ వారాహి శక్తి పీఠం అమ్మవారికి పంచమి ప్రత్యేక పూజలు

పుత్తూరు రూరల్, మే 31 ప్రభాతవార్త:

పుత్తూరు సమీపంలో ఉన్న పరమేశ్వర మంగళం నగరి మధ్యలో శ్రీ దక్షిణ ఖాళీ వారాహి శక్తిపీఠం లో శనివారం చైర్మన్ మోహనమ్మ ఆధ్వర్యంలో పంచమి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అహిల్యాబాయ్ చరిత్ర పాఠ్యాంశం కావాలి

పుంగనూరు, మే 31, ప్రభాతవార్త



వీరోచిత పోరాటాలతో పాటు ఆదర్శ పరిపాలనను అందించిన స్త్రీ మూర్తి రాణి అహిల్యా బాయి చరిత్ర దేశ పాఠశాలల పాఠ్యాంశంగా మారాలని బిజెపి జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు అడపా మల్లికా రాణి సూచించారు. శనివారం ఉదయం అహిల్యాబాయి త్రి శతాబ్ది జయంతి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. 18వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్త చరిత్రలో దాదాపు 3 దశాబ్దాల పాటుప్రశాంతంగా, అత్యంత సాధికారతతో, అత్యంత వైభవంగా రాజ్యపాలన చేసిన రాణి అహిల్యా బాయి 1725వ సంవత్సరం మే 31న మహారాష్ట్రలోని ప్రస్తుత అహ్మద్నగర్ జిల్లాలోని చోండి అనే గ్రామంలో జన్మించారన్నారు. ఈ సందర్భంగా అహల్యాబాయిహోల్కర్ జీవిత చరిత్రను ఎగ్జిబిషన్ లా ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పుంగనూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు యం. జగదీష్ రాజు, టీవీఎస్ ప్రసాద్, పెద్దమటం బాబు, సీనియర్ నాయకులు రమేష్, చంద్ర శేఖర్ రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ప్రశ్నించినందుకు పోలీసులు పగబట్టారు'

పూతలపట్టు, మే 31, ప్రభాతవార్త



పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డి పల్లెకు చెందిన భాను ప్రకాష్‌ను ఏ తప్పు చేయకుండానే పోలీస్ స్టేషన్లో రెండు రోజులు ఉంచి మానసికంగా శారీరకంగా పోలీసులు వేధించారని భాను ప్రకాష్ ఆరోపించారు. వివరాల్లోకి వెళితే ఉపాధి హామీ పథకం కింద సహాయకురాలుగా పనిచేస్తున్న ఆదమ్మ పిల్లలను బాల కార్మికులుకు మార్చి పనిచేస్తున్నారని గత నెల 11వ తేదీన ఉపాధి హామీ పథకం జిల్లా పిడి అధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా గత 14వ తేదీన ఖాతాదారులతో లేబర్ అధికారి సహాయ కార్మిక కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఆదెమ్మ ఈ ఫిర్యాదులను మనసులో పెట్టుకొని పూతలపట్టు పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ 19వ తేదీన ఇచ్చింది పోలీసు వారు నన్ను స్టేషన్‌కు రమ్మన్నారు. వెళ్ళగా సిఐ కృష్ణమోహన్ ఆదెమ్మ మీద అర్జీలు ఎందుకు ఇచ్చావు అని పచ్చి బూతులు తిట్టాడు ఇంకొకసారి ఆదెమ్మ మీద అర్జీలు ఇస్తే కాలు చేతులు వీరి చేస్తానని నాన్ బెల్ కింద కేసులు పెట్టి రిమాండ్ పంపిస్తా బెయిల్ కావాలంటే నీ ఆస్తులు అమ్ముకోవాలి అని బెదిరించాడు. రెండు రోజులు కంప్లీట్ ఏ మనీ చెప్పకుండా స్టేషన్లో కింద కూర్చొని పెట్టారు. మానసికంగా హింసకు గురి చేశారని ఆవేదన తెలియపరిచారు. ఆదెమ్మ నాపై పెట్టిన కంప్లైంట్ పేపర్ సమాచార హక్కు చట్టం కింద ఒక సాధారణ పౌరుడు దరఖాస్తు చేసుకుంటే దానికి వివరణ ఇవ్వకపోవడం వారి అసమర్థతకు నిలువెత్తు నిదర్శనం అని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తన న్యాయం చేయాలని అకారణంగా తనను మానసిక వేదనకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని బాధితుడు భాను ప్రకాష్ కోరారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన రేషన్ డీలర్లు

పలమనేరు, మే 31, ప్రభాతవార్త:



పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం పలమనేరు నియోజకవర్గ రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసిన రేషన్ దుకాణ డీలర్లు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిను పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లె, వి.కోట, పెద్దపంజాణి రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. విశ్వనాథరెడ్డి, మునిరత్నం, వినోద్, మోహన్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో 95శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి

-మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి

పలమనేరు, మే 31, ప్రభాతవార్త:

పలమనేరు మున్సిపాలటీ పరిధిలో శనివారం ఒక్కరోజులో 95.41శాతం పెన్షన్లు పంపిణీ చేపట్టడం జరిగిందని పలమనేరు మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి తెలిపారు. పలమనేరు పట్టణంలో మొత్తం 4505 పెన్షనర్లు ఉండగా శనివారం ఒక్కరోజులో 4298 మంది లబిద్ధిదారులకు పెన్షన్లను అందించామని తెలిపారు. దీంతో 95శాతం పెన్షన్లు పూర్తికాగా మరో 5శాతం లబ్ధిదారులు అందుబాటులో వచ్చిన వెంటనే అందించడం జరుగుతుందని తెలిపారు.

## పండుగ వాతావరణంలో నిత్యావసర వస్తువులు పంపిణీ

చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త



చౌకదుకాణాల్లో ఈనెల 1నుంచి పండుగ వాతావరణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశామని తహశీల్దార్ హనుమంతు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 33చౌకదుకాణాల్లో 13,274రేషన్ కార్డులున్నాయన్నారు. ప్రభుత్వం ఎండియులను నిషేధించి పాత పద్ధతి ద్వారానే రేషన్ పంపిణీ అమలు చేస్తోందన్నారు. వృద్ధులు, వికలాంగులకు చౌకదుకాణదారుడు ఇంటి వద్దకే అందించే చర్యలు చేపట్టామన్నారు. రేషన్ కార్డుదారులు చౌకదుకాణాల వద్ద సరుకుల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్నేహితుడి కోసం సేవారంగంలోకి...!

చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త



బాల్య స్నేహం గొప్పతనాన్ని నిరూపిస్తూ కొందరు యువకులు మరణించిన తన స్నేహితుని జన్మదినం సందర్భంగా సమాజ సేవకోసం నడుం బిగించారు. సరిగ్గా సంవత్సరం క్రితం చౌడేపల్లికి చెందిన ఆదర్శసాయి మదనపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని పుట్టినరోజున స్నేహితులందరూ కలుసుకొని స్థానిక బస్టాండులో కేక్ కట్‌చేయడమే కాకుండా అన్నదాన శిబిరాన్ని నిర్వహించి పేదల ఆకలి, దప్పులను తీర్చారు. సొంత మనుష్యులు మరణిస్తేనే మరచి పోతున్న ఈ రోజుల్లో చనిపోయిన స్నేహితుడి కోసం సామాజిక కార్యక్రమాలు నిర్వహించిన యువకులను స్థానికులు అభినందించారు

## మాట నిలుపుకుంటున్న వ్యక్తి సిఎం చంద్రబాబు



ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మే 31 ప్రభాతవార్త

ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకుంటున్న వ్యక్తి సిఎం చంద్రబాబునాయుడు అని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం పేదల సేవ కార్యక్ర మంలో భాగంగా స్థానిక కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సిఎం చంద్రబాబునాయుడు కొత్తగా 2971 పెన్షన్లను మంజూరు చేయించారన్నారు. గత వైసిపి పాలనలో జగన్ ఏటా 250రూ.లు మాత్రమే పింఛన్ పెంచేవారన్నారు. అదే సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికలకుముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతినెలా 4వేల వంతున వృద్ధులు, వికలాంగులు, వితంవులకు పెన్షన్ అందిస్తున్నారన్నారు. అర్హులైన వారికి మరలా ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. జూన్‌నెలలో తల్లికి వందనం, ఆగస్టు నెలలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీలను సిఎం చంద్రబాబు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌సత్యేంద్రశేఖర్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు, నేతలు అన్సర్, వరదరాజులు, జయల సుకుమార్, మురళి, లోకేష్, మహేంద్ర పాల్గొన్నారు.

## తహసీల్దార్ మునిరత్నం సేవలు చిరస్మరణీయం

కేవీబీ పురం, మే 31 ప్రభాతవార్త:

కేవీబీపురం తహసీల్దార్ మునిరత్నం సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. తహసీల్దార్ మునిరత్నం పదవీ విరమణను పురస్కరించుకుని దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మునిరత్నం డిప్యూటీ తహసీల్దార్‌గా, ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వివిధ హోదాలో సుమారు పది సంవత్సరాలుగా పని చేసి మండలంలోని పేద ప్రజలకు మెరుగైన సేవలందించడం విశేషమన్నారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ మునిరత్నం ప్రజలకు ప్రభుత్వానికి చేసిన సేవలు చాలా చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్‌తెలుగుదేశం పార్టీనాయకుడు మునస్వామి యాదవ్, కూటమి నాయకులు, జనసేన పార్టీ అధ్యక్షుడుథామస్, బీజేపీమండల అధ్యక్షుడుబాబు, శ్రీహరియాదవ్, విజయకుమార్‌నాయుడు, ధనంజయ లురెడ్డి, లాల్‌బాబు యాదవ్, పాలగిరి మల్లికార్జున్‌రెడ్డి, తెరణి జయరాంరెడ్డి, అవసరం సురేష్‌రెడ్డి, మనీ, సర్పంచ్‌లు దొరబాబునాయుడు, పొన్నూరు బాలాజీ, సురేష్, కందస్వామి, శివరావు, పరందాంరెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు దాసరి జనార్ధన్, ఎంపీడీవో మాలతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, సునీత, ఈవోపీఆర్‌డీ ప్రవళిక, ఏపీఎం శోభారాణి, మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఏఎస్‌వో మల్లమ్మ, సత్యవేడు డీటీ పల్లెరెడ్ల సంఘం రాష్ట్ర డైరెక్టర్ మాజీ ఎంపీపీ, తెరణి ధనంజయరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### న డాక్టరేట్ గ్రహిత ఎంఈవో హేమమాలిని ఘన సన్మానం

డాక్టరేట్ గ్రహితకు ఎమ్మెల్యే ఆదిమూలం ఘనంగా పూలమాలతో సన్మానించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

## లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ చైర్ పర్సన్‌గా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్

తిరుపతి హెల్త్, మే 31 ప్రభాతవార్త :

156 దేశాల్లో ప్రపంచ పేరుగాంచిన సేవా సంస్థ లయన్స్ ఇంటర్నేషల్ సంస్థ బెంగుళూరు జిల్లా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలను డిస్ట్రిక్ట్ 317 ఇ గాను డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్‌గా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌ను నియమిస్తూ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317ఇ ఎలెక్ట్ గవర్నర్ అశ్వత్ నారాయణ స్వామి లేఖ ద్వారా తమన సందేశాన్ని పంపారు. ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ జిల్లాలలో లయన్స్ క్లబ్ సభ్యునిగా, ఉపాధ్యక్షునిగా, అధ్యక్షునిగా సేవలు అందించానని చెప్పారు. ఈ సేవలను గుర్తించి లయన్స్ ఇంటర్నేషనల్ క్యాబినెట్‌లో స్థానం కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. ముందుగా ఈ పదవి రావడానికి కారణమైన డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ అశ్వత్ నారాయణ స్వామికి, లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.

## డీలర్ల నుంచే రేషన్ సరకులు పంపిణీ - తహసీల్దార్

**పుత్తూరు రూరల్, మే 31 ప్రభాతవార్త:**

రేషన్‌షా పుల్లో నిత్యావసర సరకులు పునఃపంపిణీలో డీలర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి 15 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తప్పని సరిగా కార్డు దారులకు రేషన్ అందించాలని తెలిపారు. 65 సంవత్సరాల వయసు కలిగి, అనారోగ్యంగా ఉన్న వారి ఇళ్ళ వద్దకు వెళ్లి రేషన్ అందించాలని తెలిపారు. నేడు ఆదివారం మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో నిత్యావసర సరకులు పండుగలా అందజేయాలని తెలిపారు. సమావేశంలో ఉప తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, డీలర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## ఉద్యోగులందరూ తమ శేష జీవితం ఆనందంగా గడపండి

నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, మే 31, ప్రభాతవార్త



ఉద్యోగ జీవితం నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అందరూ తమ శేష జీవితాన్ని ఎంతో ఆనందంగా, ఆయురారోగ్యాలతో గడపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్యలు అన్నారు. నగర పాలక సంస్థలో షరాబు గా పనిచేస్తున్న శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ నాగేంద్ర, అసిస్టెంట్ ఆడిటర్ లక్ష్మి సౌజన్యల ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం సాయంత్రం రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు మాట్లాడుతూ నగరపాలక సంస్థ లో ఎన్నో ఏళ్లుగా విశేష సేవలు అందించిన వీరు ఉద్యోగ విరమణ పొందడం ఒక వైపు బాధ కల్పించినా, మరో వైపు వారు కొత్త జీవితం ప్రారంభిస్తుండడం సంతోషంగా ఉందని అన్నారు. వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎగ్జామినర్ రామచంద్రా రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ రంగయ్య, ఏసిపిలు బాలాజి, మూర్తి, అకౌంటెంట్ రమేష్, మేనేజర్ హాసీమ్, సర్వేయర్ కోటేశ్వర రావు, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

**వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:** రేషన్‌షాపుల్లో నిత్యావసర సరకులు పునఃపంపిణీలో డీలర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ జరీనా తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ పంపిణీపై డీలర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నేటి నుంచి 15 తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తప్పని సరిగా కార్డు దారులకు రేషన్ అందించాలని తెలిపారు. 65 సంవత్సరాల వయసు కలిగి, అనారోగ్యంగా ఉన్న వారి ఇళ్ళ వద్దకు వెళ్లి రేషన్ అందించాలని తెలిపారు. నేడు ఆదివారం మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో నిత్యావసర సరకులు పండుగలా అందజేయాలని చెప్పారు.



## ఎస్వీయూలో డీఎస్ఈ నిపుణుల బృందం

**తిరుపతి విద్య. మే 31 ప్రభాతవార్త**



భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి చెందిన డీఎస్టి నిపుణుల బృందం ఎస్వీయూలో శనివారం పర్యటించింది. ప్రాజెక్టులపై సమీక్ష, విద్యా, పరిశోధనల స్థితిగతులపై బృందం వర్సిటీ అధికారులతో సమావేశమైంది. ఆదివారం వరకు జరిగే ఈ పర్యటనలో ఎయిమ్స్ రుమటాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాకుమార్, శాస్త్రవేత్త డాక్టర్ ఉమేష్ కుమార్ శర్మ, డాక్టర్ ఫణి కుమార్ పాల్గొన్నారు. అనంతరం వీసీ ఛాంబర్లో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జువాలజీ ప్రొఫెసర్ ఎస్ కిషోర్ తో సమావేశమయ్యారు.

## రెవెన్యూలో బ్రహ్మయ్య చౌదరి సేవలు మరువలేం

**తిరుపతిరూరల్, మే31 ప్రభాతవార్త:**



రెవెన్యూశాఖలో పులివర్తి బ్రహ్మయ్యచౌదరి సేవలు మరువలేమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం బ్రహ్మయ్యచౌదరి పదవీవిరమణ కార్యక్రమాన్ని తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయ మిద్దెపైన శనివారం నిర్వహించిన చౌదరి పదవీవిరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతిరూరల్ తహశీల్ధార్ రామాంజులనాయక్ తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించారు. బ్రహ్మయ్యచౌదరి విధి నిర్వాహణలో ఎలాంటి ప్రలోభాలకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేసారని తెలిపారు. రెవెన్యూ రికార్డుల పరిశీలన, చేర్పులు, మార్పులు, సర్టిఫికేట్స్ జారీ చేయడంలో ఆయనది అందివేసిన చెయ్యిగా సహచర ఉద్యోగులు చెప్తుంటారు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఉప తహశీల్థార్ జయంత్‌కుమార్, అర్బన్ ఉప తహశీల్థార్ కిరణ్‌కుమార్, ఆర్ఎస్ డిటి మోహన్‌బాబు, ఆర్ఐ వర్మ, రెవెన్యూ సిబ్బందితో పాటు తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, మధుశేఖర్, నాగూరు శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, కత్తి సుధాకర్, తిరుచానూరు కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్కులను శుభ్రంగా ఉంచండి

**తిరుపతి కార్పొరేషన్, మే 31, ప్రభాతవార్త**



నగరంలోని ఎన్.జీ.ఓ. కాలనిలో పార్కుతో పాటు అన్ని పార్కులను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని 40వ వార్డులో పారిశుధ్య పనులను, పార్కును కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కులో పిచ్చి మొక్కలు తొలగించి పూలమొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణకు ప్రతిరోజూ వాహనాలు ఇండ్ల వద్దకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని అన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చి నగర శుభ్రతకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, తుడా ఈఈ రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, డి.ఈ.లు వెంకటప్రసాద్, శిల్పా, సర్వేయర్ కోటేశ్వర రావు తదితరులు ఉన్నారు.

## శేష జీవితం ప్రశాంతంగా గడపండి



**టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్**

**తిరుపతి కార్పొరేషన్, మే 31 ప్రభాతవార్త**

ఎఫ్ బీఓ కోదండన్ పదవీవిరమణ సమావేశంలో టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ టాస్క్ ఫోర్సులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ శనివారం పదవీ విరమణ పొందిన సి.కోదండన్‌కు ఘనంగా టాస్క్ ఫోర్సు అధికారులు వీడ్కోలు పలికారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆయనకు శాలువ కప్పి, మెమెంటోను అందజేశారు. తరువాత మాట్లాడుతూ గతంలో అటవీ శాఖలో విధులు నిర్వర్తించిన కోదండన్, టాస్క్ ఫోర్సు ప్రారంభించినప్పటి నుంచి టాస్క్ ఫోర్సులో విధులు నిర్వహించి, శనివారం పదవీ విరమణ పొందారని తెలిపారు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎసీఎఫ్ శ్రీనివాస్, సీఐ సురేష్ కుమార్, అడ్మిన్ ఆఫీసర్ పాపారావు, ఏఏఓ లోకనాథం, ఆర్ఎస్ఐ వినోద్ కుమార్, ఎఫ్ఆర్‌ఓలు మురళీ కృష్ణ, ప్రేమ ఇతర సహోద్యోగులు పాల్గొని, అభినందనలు తెలిపారు.

## ఇళ్ళలో చోరీలు చేసే దొంగ అరెస్టు

**తిరుపతి కార్పొరేషన్, మే 31, ప్రభాతవార్త**



ఇళ్ళలో చోరీలు చేయు దొంగను అరెస్టు చేసి సుమారు రెండు లక్షలు విలువ చేసే 21 గ్రాములు బంగారు నగలు, 488 గ్రాముల వెండి ఆభరణములు, రెండు శాంసంగ్ టీవీలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి పోలీసులు వివరాల మేరకు ఈ నెల 4వ తేది శ్రీ కృష్ణ నగర్, ఎంఆర్ పల్లిలో కాపురం ఉంటున్న పుల్లా రెడ్డి తన కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి బెంగుళూరుకు వెళ్ళి తరువాత 16వ తేది రాత్రి ఇంటికి రాగా ఎవరో దొంగలు ఇంటికి ఉన్న తాళం పగల కొట్టి ఇంటిలోని బంగారు, వెండి, విడిలను దొంగిలించుకుని వెళ్ళారు. పుల్లారెడ్డి ఫిర్యాదు చేయగా తిరుపతి క్రైం పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. గత రెండు నెలలుగా పద్మావతి నగర్, చర్లోపల్లి, శ్రీ కృష్ణ నగర్ చుట్టు పక్కల ఇంటి దొంగతనములు, అలాగే షాప్‌లో దొంగతనములు జరిగిందన్నారు. వరుసగా జరుగుతున్న నేరాలను ఛేదించాలని జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాలు మేరకు తిరుపతి సిసిఎస్ అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో తిరుపతి సిసిఎస్ డిఎస్పి శ్యామ్ సుందరం, ఇన్స్పెక్టర్లు చిన్న పెద్దయ్య, ఎన్. శివ కుమార్ రెడ్డి, జి. ప్రకాష్ కుమార్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ రెడ్డి, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, అనుమానితుల గురించి విచారించి, వారి యొక్క కదలికల పైన నిఘా పెట్టి, శనివారం ఉదయం 10 గంటలకు రాయల చెరువు రోడ్డు, తిరుపతిలో ముద్దాయి తమటం భాను చంద్ర ఆచారి అలియాస్ భానుని అరెస్టు చేసి, అతని నుండి రెండు లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి చెడు అలవాట్లుకు అలవాటు పడి, గ్రామంలో కొత్తగా ఇల్లు కట్టి చుట్టుపక్కల అప్పులు చేసి డబ్బులు సంపాదించాలని దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా దొంగతనాలు వరుసగా తిరుపతి ముత్యాల రెడ్డి పల్లి చుట్టుపక్కల అలాగే చర్లోపల్లిలో వరుసగా 4 నేరములు చేసి పోలీసు వారిచే అరెస్టు చేసారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుపతి సిసిఎస్ ఇన్స్పెక్టర్‌లు వి. చిన్న పెద్దయ్య, ఎన్. శివ కుమార్ రెడ్డి, జి. ప్రకాష్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి, క్రైమ్ పార్టీ సిబ్బంది ఎఎస్ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుల్లు అయిన రవి ప్రకాష్, మురళి, మునిరాజ, రమేష్, కానిస్టేబుల్ నాగరాజు, మోహన్, ఈశ్వర్, హరిప్రసాద్‌లను తిరుపతి జిల్లా ఎస్పి అభినందించి వారికి నగదు రివార్డులను క్రైం డిఎస్పి తెలిపారు.

## పొగాకుకు బానిస కాకు...

**సత్యవేడు, మే 31 ప్రభాతవార్త:**

ఆరోగ్యకరమైన భవిష్యత్ కోసం పొగాకు వినియోగానికి ప్రజలు దూరంగా ఉండాలని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ కోరారు. శనివారం పొగాకు నిరోధక దినోత్సవం పురస్కరించుకుని పొగాకు వినియోగ అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పొగాకు సంబంధిత ఉత్పత్తుల యొక్క హానికరమైన ప్రభావాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పొగాకు నిరోధక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ముఖ్యంగా పొగాకు రహిత జీవన శైలి ప్రయోజనాలను హైలెట్ చేయాలన్న ఉద్దేశమే పొగాకు వ్యతిరేక దినోత్సవం అన్నారు. పొగాకు వినియోగం వల్ల ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 8 మిలియన్ల ప్రజలు మృతి చెందుతున్నట్టు ఒక అంచనా ఉందన్నారు. పొగాకు హానికరమైన ప్రభావం నుంచి భవిష్యత్ తరాలను కూడా రక్షించుకోవాలన్నారు. అనంతరం పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## తలుపు తట్టి పింఛన్లు పంపిణీ...

**రేణిగుంట, మే 31 ప్రభాతవార్త**

రేణిగుంట మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల బట్వాడా ప్రక్రియ శనివారం శరవేగంగా జరిగింది. మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు ఎన్ డి ఏ కూటమి నేతలతో కలిసి తెల్లవారక ముందే ఇంటి తలుపులు తట్టి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. రేణిగుంట మండలం అన్నాసంపల్లె పంచాయతీలో అధికారులతో కలిసి బిజెపి యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ ఇంటింటికి తిరిగి దగ్గరుండి పింఛన్లను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. రేణిగుంట మండలంలో సాయంత్రానికి దాదాపు 94 పైచిలుకు పింఛన్లు పంపిణీ చేశారు.

## ఏర్పేడు వైకాపా పగ్గాలు కూనాటికి

**శ్రీకాళహస్తిరూరల్, మే 31 ప్రభాతవార్త**





శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా పార్టీ మండల నాయకులను నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఈ నేపథ్యంలో ఏర్పేడు మం డలం పార్టీ పగ్గాలను మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కూనాటి రమణయ్యయాదవ్‌కు అప్పగించారు. మండల నాయకుల ఎంపికకు సంబంధించి కసరత్తు చేసి కులాలు వర్గాల సమీకరణలో పదవులను అప్పగించారు. కూనాటి రమణయ్య యాదవ్ ఎంపిటిసి ఉన్నారు. మండలంలో యాదవుల సంఖ్యగణనీయంగా ఉండటంతో ఆ వర్గానికి పగ్గాలు అప్పగించారు. కాగా శ్రీకాళహస్తి మండలం పగ్గాలను చెవిరెడ్డి మధుసూధనరెడ్డికి అప్పగించారు. మధుసూధనరెడ్డి పట్టణంలో ఓ ప్రధాన పాఠశాలను నిర్వహిస్తున్నారు. వైకాపా హయాంలో సింగిల్ విండు అధ్యక్షులుగా పని చేసారు. అంతేకాక మాజీ శాసనసభ్యునికి అత్యంత సన్నిహితుడుగా మెలిగారు. ఆయనకు సామాజిక వర్గాల సమీకరణలో రెడ్డి సామాజిక వర్గానికి అప్పగించారు. కాగా తొట్టంబేడు మండల డాక్టర్ కోగిల సుబ్రమణ్యంకు అప్పగించారు. వృత్తిరీత్యా ఆయన డాక్టర్ అయినందువల్ల ఈ మండలంలో జనాభా ప్రాతిపదికన ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు మాజీ శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి వివరించారు.

## పొగాకు వినియోగం ప్రాణాంతకం

**మండల ఆరోగ్య అధికారి డాక్టర్ యుగంధర్**

**చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:**




పొగాకు వినియోగం ప్రాణాంతకమని మండల ఆరోగ్య అధికారి డాక్టర్ ఐ.యుగంధర్ తెలిపారు. స్థానిక రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పొగత్రాగడం, పొగాకు వినియోగించడం వలన కలిగే దుష్పరిణామాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వినియోగం వలన శరీరంలోని ఏ అవయవానికైనా క్యాన్సర్ వచ్చే అవకాశం వుందన్నారు. బీడి, సిగరెట్, పాన్ పరాగ్, గుట్కా వంటి వాటిని వినియోగించడం వలన రక్తపోటు, పక్షవాతం, గుండె సంబంధిత సమస్యలు, రక్తనాళాలు గట్టిపడటం, సంతానోత్పత్తి తగ్గిపోవడం వంటి అనేక ఆరోగ్య సమస్యలతో పాటు ముఖ్యంగా కాన్సర్ బారినపడి అర్ధాయుష్షుతో ప్రాణాలు పోగొట్టు కునే అవకాశం వుందన్నారు. ప్రతి ఒక్కరూ మీ కుటుంబ సభ్యుల పట్ల ఆరోగ్యకరమైన అవగాహనతో యోగ, ధ్యానం, వాకింగ్ అలవరుచుకోవాలనీ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రేవతి, డాక్టర్ ప్రణీత, డాక్టర్ ఆర్.లహరి, ఎం.హేమిత, ఎం.లహరిప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.టాటాబాయి, సూపర్‌వైజర్లు కె.నారాయణ రాజు, ఎం.ప్రమీల, పద్మావతి నర్సింగ్ కళాశాల ట్యూటర్స్ విజయభార్గవి, బేగం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వం



**ఎంఎల్ఏ పులివర్తి నాని**

**రామచంద్రాపురం, మే 31 ప్రభాతవార్త:**

కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమనీ, చెప్పిందే చేస్తుందని చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. శనివారం రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఎస్టీ కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్ళి అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి పింఛన్లను అందజేశారు. అనంతరనం ఆయన మాట్లాడుతూ 1వ తారీఖున ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో కులమతాలకు, పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సంజీవి హరి, బిజెపి మండల అధ్యక్షుడు జనార్ధన్ నాయుడు, టిడిపి నాయకులు తానికొండ కేశవులు నాయుడు, జనార్దన్ చౌదరి, లెక్కల సురేంద్ర నాయుడు, కోరా హరిప్రసాధ్, మునిరామిరెడ్డి, ఆర్.లీలామోహన్, నరశింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి, జవ్వాది ప్రకాష్, సోము రాయల్, కోటీశ్వర్ రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, త్యాగరాజులు రాయల్, రాజేష్ రాయల్, వసంతనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే సామాజిక పింఛన్లు

**టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి**

**చంద్రగిరి, మే 31 ప్రభాతవార్త:**



వృద్దులు, వికలాంగులు, వితంతువులకు, అనారోగ్య పీడితులకు కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీకి అవకాశం కల్పించినట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన అధికారులు, నాయకులతో కలసి పట్టణంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న ఆదివారం రావడంతో మే 31న శనివారమే పింఛన్లు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందజేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ దినేష్ రెడ్డి, సచివాలయ సర్వేయర్ లలిత, శ్రీతేజ, టిడిపి యూత్ మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, లోక, గురవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌ని కలిసిన జడ్పీటీసీ

**నారాయణవనం, మే 31 ప్రభాతవార్త :**



ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగుదే:శం పార్టీ సీనియర్ నాయకులు కొండేటి గంగాప్రసాద్‌ని చెన్నైలోని ఆయన కార్యాలయంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జడ్పీటీసీ, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గం రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు మాణిక్యంరెడ్డి తదితరులు పాల్గొన్నా న్నారు.

## హౌస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలుగా మనోహరమ్మ

**నారాయణవనం, మే 31 ప్రభాతవార్త :**



మండలకేంద్రంలోని నారాయణవనం బాలికల ఉన్నత పాఠశాలలో హౌస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయు రాలుగా డి.మనోహరమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె పాలమంగళం ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఇక్కడ వచ్చారు. ఆమె బాధ్యతలు స్వీకరించడంతో పలువురు ఉపాధ్యాయులు అభినందలు తెలిపారు.

## అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు నడవాలి

**ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి**



శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పనిచేసే కమిషనర్ అంటే అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు నడవాలని ఎంతో కీలకమైనదని ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పని చేసిన కమిషనర్ బియస్ గిరికుమార్ స్వల్ప కాలంలో సమర్థవంతంగా పని చేసారని ప్రశంసించారు. ఈ దివ్యక్షేత్రంలో పని చేయటం పూర్వజన్మ సుకృతమని అలాంటి మహత్తర అవకాశాన్ని శివయ్య గిరికుమార్‌కు అందించారన్నారు. ఉద్యోగుల్లో విరమణ సర్వసాధారణం అన్నారు. ప్రతి ఒక్కరు జవాబుదారి తనంతో పని చేస్తే మంచిపేరు వస్తుందన్నారు. కమిషనర్ గిరికుమార్ మాట్లాడుతూ తాను ఇక్కడ పని చేసింది స్వల్పకాలమే అయినా ఎంతో సంతృప్తి చేకూరిందన్నారు. ఇక్కడ పని చేయటంలో తనకు సిబ్బంది ఎంతో సహకరించారన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి సత్కరించారు. సత్కార సమావేశంలో మేనేజర్ విజయభాస్కర్, డిఇఇ సంజీవ్ కుమార్, ఆర్ఓ ఖాదర్‌మొహిద్దిన, ఎఇఇ తేజస్వీని, పిఎంఎం జయరామయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ శ్రీకాళహస్తి తెలుగుదేశం నాయకుడు జి.విజయకుమార్ పాల్గొన్నారు.

## పుల్లయ్య సేవలు మరువలేనివి

**తిరుపతి కలెక్టరేట్, మే 31 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా సమాచార శాఖలో వివిధ హోదాలలో పనిచేసి ఏ.వి సూపర్‌వైజర్‌గా శనివారం పదవి విరమణ చేసిన వై.పుల్లయ్య సేవలు మరువలేనివని, ఆయురోగ్యాలతో ఉండాలని జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య తదితర సమాచార శాఖ అధికారులు పేర్కొన్నారు. తిరుపతి సమాచార శాఖలో ఏవి సూపర్‌వైజర్‌గా పనిచేసిన పుల్లయ్య శనివారం పదవీ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో బాలకొండయ్య మాట్లాడుతూ పదవి విరమణ చేసిన ఏవి సూపర్‌వైజర్ పుల్లయ్య సమాచార శాఖలో ఎనలేని సేవలు చేశారని తెలిపారు. పుల్లయ్య మాట్లాడుతూ తాను 1985 అక్టోబరు 25వ తేదిన సినీ ఆపరేటర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరానని అప్పటి నుంచి తన విధులను అధికారులు చెప్పిన విధంగా వారి సూచనలు పాటిస్తూ తన వృత్తి ధర్మాన్ని చేశానని తెలిపారు. సహకరించిన అధికారులకు, సిబ్బంది అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో ఈశ్వరమ్మ, ఏపీఆర్ఓ గోపి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తి ట్రాఫిక్‌కు ఎస్ఐ నియామకం

**శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐను నియమిస్తూ జిల్లా ఎస్పి ఉత్తర్వులు జారి చేసారు. గత ఆరు నెలలుగా ఇక్కడ ట్రాఫిక్‌ను పర్యవేక్షించే అధికారి లేకుండా వన్‌టౌన్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందితోనే సిఐ గోపి నిర్వహిస్తున్నారు. ఇరుకు వీధుల్లో ప్రతినిత్యం ట్రాఫిక్ స్థంభిస్తుంది. ఈ సమస్యను పలుమార్లు జిల్లా ఎస్పి దృష్టికి తెచ్చారు. పుణ్యక్షేత్రంలో సమస్యను గుర్తించిన జిల్లా అధికారి ట్రాఫిక్ ఆర్ఎస్ఐగా జిహెచ్ గోవిందును నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఆయన విధి నిర్వహణను స్వీకరించారు. శ్రీకాళహస్తిలోని పరిస్థితిని సమీక్షి స్తున్నారు.

## యోగా దినోత్సవం

**శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం టూ టౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా డివైయస్‌పి నరసింహామూర్తి సారధ్యంలో డివిజన్‌లోని పోలీసులు పట్టణంలో ప్రదర్శనలు జరిపారు. ఈ ప్రదర్శనలు టౌన్ సిఐ డిగోపి సారధ్యంలో నిర్వహించగా సిఐలు నాగార్జున్‌రెడ్డి, తిమ్మయ్య, రవి నాయక్‌లు వారి సిబ్బంది పాల్గొన్నారు. కాగా శనివారం ఉదయం యోగా దినోత్సవం సందర్భంగా సిఐ నాగార్జున్‌రెడ్డి సారధ్యంలో యోగా తరగతులను వారి సిబ్బందికి నిర్వహించారు. యోగాంధ్రగా తీర్చి దిద్దుటకు దాని ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుటకు ప్రభుత్వం సరికొత్త పథకాన్ని రూపొందించిందన్నారు. .జూన్ నెల 21 వరకు దినోత్సవాలు నిర్వహించుటకు ఆదేశించిందన్నారు. యోగాంధ్రప్రధాని కూడా హాజరవటం గమనిస్తే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై కేంద్ర స్పందన అర్థమౌతుందన్నారు. ఈ కార్యక్రమాల్లోఎస్ఐ పార్థసారధి వారి సిబ్బంది పాల్గొన్నారు.

## 3 నుంచి బంగారమ్మ జాతర

**తొట్టంబేడు, (శ్రీకాళహస్తి రూరల్), మే 31 ప్రభాతవార్త**

తొట్టంబేడు మండలంలోని బంగారమ్మ ఆలయంలో ఈ నెల 3 నుంచి జాతర నిర్వహించుటకు తీర్మానించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బంగారమ్మ ఆలయంలో భారీ ఎత్తున జాతర నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో దేవస్థానం ఇఓ డి.బాపిరెడ్డి జాతర ప్రకటనను జారి చేసారు. ఈ నెల 3 ఉదయం 6గంటలకు అమ్మవారికి అభిషేకాలతో జాతర కు శ్రీకారం చుట్టబడుతుందన్నారు. 10గంటలకు మైలురాయి ముగ్గు, మధ్యాహ్నం పోతురాజు ముగ్గు, సాయంత్రం పొంగళ్ళు నిర్వహించబడుతుందని వివరించారు. 4న అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, 4గంటలకు కుంభం సాయంత్రం6గంటలకు అమ్మవారి గ్రామోత్సవం, నిమజ్జనం నిర్వహించబడతాయని ఇఓ బాపిరెడ్డి తెలిపారు.

## శ్రీకాళహస్తిలో విశేష సేవలందించిన నాగపద్మజ రిటైర్డ్

**శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో విశేష సేవలందించిన ఈటిసి ప్రిన్సిపల్ నాగపద్మజ శనివారం ఉద్యోగ విరమణ చేసారు. ఈ సందర్భంగా కాసాతోటలోని ఈటిసి సెంటర్‌లో ఆమెకు సిబ్బంది పట్టణ ప్రముఖులచే ఘనసన్మానం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నాగపద్మజ ఆమె భర్త గుడ్లూరు జగన్మోహన్ నాయుడు దంపతులను ఘనసన్మానం చేసారు. శ్రీకాళహస్తి మండల ఎంపిడిఓగా గతంలో పని చేసిన నాగపద్మజ ఏర్పేడు ఎంపిడిఓగా పని చేసారు. తరువాత పదోన్నతిపై ఆమె ఈటిసి సెంటర్ ప్రిన్సిపల్‌గా వచ్చారు. సుమారు 6సంవత్సరాలుగా ఇక్కడ సేవలందించిన ఆమె శనివారం ఉద్యోగ విరమణ చేసారు. ఈసందర్భంగా సిబ్బంది ఘనసన్మానం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగపద్మజ మాట్లాడుతూ ఆత్మీయుల మధ్య తాను ఉద్యోగ విరమణ చేయటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఈటిసి సెంటర్‌ను నాగపద్మజ హయాంలో ఓ నందన వనంలా మార్చారన్నారు. ఇక్కడ దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులకు శిక్షణలు ఇచ్చారన్నారు. అంతేకాక ఆమె హాయంలో ఇక్కడ శివాలయం నిర్మించి కుంబాభిషేకం జరిపించామన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి పట్టు వస్త్రాల సమర్పణ

**శ్రీకాళహస్తిరూరల్, మే 31 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలకు స్వామి అమ్మవార్ల పట్టు వస్త్రాలను శనివారం బహూకరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తిలోనూ, పాపానాయుడుపేటలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు భారీ స్థాయిలో నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు సంప్రదాయబద్దంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మెన్ కొంగరకృష్ణారెడ్డిదంపతులు, మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి, సారధ్యంలో మాజీ ఎంపిఓ మునిధర్మారెడ్డి, వి.చెంచురెడ్డి దంపతుల సారధ్యంలో పట్టు వస్త్రాలను అందించారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఆర్‌టిసి ఉద్యోగులకు సన్మానం

**శ్రీకాళహస్తి, మే 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపోలో పని చేస్తూ పలువురు ఉద్యోగులు ఉద్యోగ విమరణ చేసారు. శనివారం వారికి డిపో ఆవరణలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు ఏసారు. డిపోలో కండక్టర్‌గా పని చేసిన సులోచనమ్మ, డ్రైవర్‌గా పనిచేసిన శ్రీను, పిఆర్ఎం రెడ్డి, గ్యారేజ్‌మెకానిక్ శేఖర్‌లు ఉద్యోగ విరమణ చేసారు. వారి సన్మానం సందడిగా మారింది. ఉద్యోగ విమరణ చేసిన వారికి అబినందిస్తూ సత్కరిం చారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అం జూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. అందరికి దుశ్శాలువలతోనూ, స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో డిపోమేనేజర్ మునిచంద్ర, కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్ కుమార్, జిపిఎస్ ఆచారి, టిఎల్‌మూర్తి, కుప్పయ్య, సునీల్‌నాయుడు, కుమార్, గురవమ్మ, బిజెలక్ష్మీ, వైకె మూర్తి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైపాకా నాయకుడు మృతి

**శ్రీకాళహస్తిరూరల్, మే 31 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని ఓ సీనియర్ వైకాపా నాయకుడు రంగారెడ్డి మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి నివాళలర్పించారు. ఆయన అంతిమ యాత్రకు హాజరయ్యారు. పాతవీరాపురంలోని పాతగుంట రంగారెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యుడు అక్కడకు చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి నివాళలర్పించారు. ఆయనతోపాటు మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్యాయాదవ్, మునికృష్ణారెడ్డి, మునిరత్నంరెడ్డి, కేశవులు, గురునాధం, ఇసుకతాగేలి మునిరెడ్డి, హరిదాసు రెడ్డి, మునిరత్నం రెడ్డి తదితరులున్నారు. కాగా శ్రీకాళహస్తి పట్టణంలోని పీర్లచావిడి వీధిలో పోతురాజు నాగేంద్ర ఆనారోగ్యంతో మృతి చెందారు. వారికి శనివారం మాజీ ఎంఎల్ఏ మధుసూధనరెడ్డి నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, స్వర్ణమూర్తి, కొట్టే సత్యనారాయణ, ధానమునస్వామి, సురేష్, కంఠా ఉదయ్, కొట్టేశరవణ, విజయకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ట్యాంకర్-లారీ ఢీకొని యువకుడు మృతి



**వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:**

తిరుపతి-చెన్నైజాతీయ రహదారిపై కదిరిమంగళం బైపాస్ వద్ద రోడ్డు దాటుతున్న యువకుడిని ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం ఉదయం జరిగింది. వడమాలపేట కట్టకింద ఎస్టీకాలనీకి చెందిన చంద్రశేఖర్(35) కదిరిమంగళం బైపాస్ వద్ద రోడ్డు దాటు తుండగా తిరుపతి నుంచి చెన్నైకు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొంది. ట్యాంకర్ చక్రాల కింద నలిగి చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య శుభాషిణి ఆశ వర్కర్‌గా స్థానిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

## వైసీపీ రాష్ట్ర యూత్ సెక్రటరీ గాంధీ

**వడమాలపేట, మే 31 ప్రభాతవార్త:**



వైసీపీ స్టేట్ యూత్ సెక్రటరీగా మండలంలోని కాయం గ్రామానికి చెందిన దుడ్డు గాంధీ నియమించారు. శనివారం మండలంలోని వైసీపీ నాయకులు మునిబాబు, ఉమాపతిలు గాంధీని సన్మానించి అభినందించారు. గాంధీ మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేయడానికి, యువతను వైసీపీకి చేర్పించడానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# గూడూరు డివిజన్

## ఎమ్మెల్యేచే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ



వెంకటగిరి, మే 31 ప్రభాతవార్త: ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి నెల ఒకటో తేదీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్న ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకి దక్కిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం పదో వార్డు మను లాలాపేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం వస్తే 30వ తేదీ పెన్షన్లను పేదల ఇంటి వద్దకు చేరుస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సిఐ ఏవి రమణ, ఎస్ఐ సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకట ముని, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌లు పాల్గొన్నారు.

## దుగరాజపట్నంలో సివిల్ రైట్స్ డే



వాకాడు, మే 31 ప్రభాతవార్త: వాకాడు మండలం దుగరాజపట్నం గ్రామంలోని శనివారం తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సివిల్ రైట్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ మాట్లాడుతూ స్వేచ్ఛ, పౌర హక్కుల గురించి ప్రజలకు వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సరఫరా ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే తన దృష్టికి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ విద్యార్థులచే నో టొబాకో డే ర్యాలీ




కోట, మే 31 ప్రభాతవార్త: మండలం విద్యా నగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి విద్యార్థులు వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా శనివారం ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీని ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పొగాకు వాడటం వలన కలిగే నష్టాలను విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టి నినాదా లు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత పొగాకు, నికోటిన్ వాడకం వలన ఉజ్వల భవిష్యత్ ఎలా నాశనమవుతుందో వివరించారు. అందుకు యువత ధూమ పానానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు మాధవయ్య మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 98 శాతం పెన్షన్ పంపిణి: ఎంపీడీవో

వాకాడు, మే 31 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద మండలంలోని 5,229 వృద్ధులకు, దివ్యాంగులకు పెన్షన్ అందజేశామని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఇవ్వవలసిన పెన్షన్ను రాష్ట్ర ప్రభుత్వం 31తేదీ శనివారం పెన్షన్ ఇవ్వడం జరిగిందని అన్నారు. మండలంలోని నూరు శాతంగాను 98శాతం పెన్షన్ అందజేశామని, మిగిలింది వారి ఇళ్లకు వెళ్లి సిబ్బంది ఇస్తారని తెలిపారు.

## పిఎండిఎస్ పంటలపై రైతులకు అవగాహన




గూడూరు, మే 31 ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయ డిపిఎం షణ్ముగం ఆదేశాల మేరకు అడిషనల్ డిపిఎం పట్టాభిరెడ్డి సూచనల మేరకు డిస్ట్రిక్ట్ యాంకర్ రవిచంద్ర ప్రసాద్ అనుభవాల మేరకు ఎన్ఎఫ్ఎ మధు, ఎన్ఎఫిఎంటి తిరుమల ఆధ్వర్యంలో కడివేడు గ్రామంలో తొణుకుమాల యూనిట్, కడివేడు యూనిట్ గ్రామంలోని రైతులకు శనివారం ప్రకృతి వ్యవసాయం నిర్వహించారు. యూనిట్ ఇంచార్జిలు ఆధ్వర్యంలో పిఎండిఎస్ పంటలపై అవగాహన కల్పించారు. యూనిట్ ఇంచార్జిలు ఆధ్వర్యంలో పిఎండిఎస్ పంటలపై, వాటి యొక్క ప్రయోజనాలపై రైతులకు వివరించారు. పిఎండిఎస్ పంటలు సాగు చేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలియజేసారు. కడివేడు, తొణుకుమాల గ్రామంలో పొలంలో పిఎండిఎస్ పంట చల్లించారు. కడివేడు గ్రామంలో పిఎండిఎస్ 80 కిట్స్ 80 ఎకరాలకు తయారు చేయించడం జరిగింది. పిఎండిఎస్ పంటలు సాగు చేయడం వల్ల ఉపయోగాలు, కలుపు నివారణ జరుగుతుంది. భూసారం పెరుగుతుంది, భూమి గుల్లబారి నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడివేడు యూనిట్ ఇంచార్జి ఎన్. పూర్ణిమ, తాణుకుమాల యూనిట్ ఇంచార్జి సిహెచ్ ధనుంజయ,ఎల్ 3 కె.రాజేశ్వరి, కె.లక్ష్మి, వి.శ్రీహరి, బి.భవాని రైతులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో సంక్షేమ పథకం అమలు కాలేదు : ఎమ్మెల్యే



గూడూరు, మే 31 ప్రభాతవార్త : గత ఐదేళ్ళ వైకాపా పాలనలో రైతులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విమర్శించారు. గూడూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సబ్సిడీతో రెండు డ్రోన్లను ఆయన చేతులమీదుగా రైతులకు అందజేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 80 శాతంతో రాయితీతో రెండు డ్రోన్లను రైతులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. రెండు డ్రోన్ల విలువ 19 లక్షలా 86 వేల రూపాయలని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైకాపా పాలనలో రైతుకు ఏ ఒక్క పథకం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ధైర్యం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు రాజు, శ్రావణి, పులిమి శ్రీనివాసులు, రహీం, బిల్లు చెంచురామయ్య, వైఎస్సార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవ్వ తాతల కళ్ళలో ఆనందం కూటమి లక్ష్యం



చిల్లకూరు, మే 31 ప్రభాతవార్త : అవ్వ తాతలు వితంతువులు దివ్యాంగుల కళ్ళల్లో ఆనందం చూడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీనే పెన్షన్లను అందించడం జరుగుతుందని ఈ క్రమంలో చెన్నూరులో మహిళా నాయకురాలు మట్టం శ్రావణిరెడ్డి చేతుల మీదుగా పండగ వాతావరణంలో పెన్షన్‌ల పంపిణీ చేపట్టారు. ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని మట్టం శ్రావణిరెడ్డి తెలియజేశారు. ఎన్నికల ముందు మండుటెండలో వైఎస్సార్సీపీ వృద్ధులను ఇబ్బంది పెట్టిందని, మాపై అబాండాలు వేసేందుకు ప్రయత్నించిందని గుర్తు చేశారు. గూడూరు నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో తీసుకెళుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షులు హేమకుమార్ రెడ్డి, నాయకులు ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి, అల్లం కృష్ణయ్య, మాజీ చేనేత సొసైటీ అధ్యక్షుడు కటికల శ్రీనివాసులు, మల్లి. శ్యామల, చెన్నూరు అంకమ్మ, చెన్నూరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఇన్చార్జి ఎంపీడీవోగా గుణశేఖర్



వెంకటగిరి, మే 31 ప్రభాతవార్త : మండల ఇన్చార్జి ఎంపీడీవోగా గుణశేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవో కొన్న కె.వి కోటేశ్వరరావు పదవి విరమణ చేయడంతో గుణశేఖర్ రెడ్డిని నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీపీ తనుజా రెడ్డిని మర్యాద పూర్వకంగా ఎంపీడీవో కలిశారు. పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది ఆయనను పరిచయం చేసుకున్నారు.

## అందరి మన్ననలు పొందిన ఎంపీడీవో : ఎమ్మెల్యే



వెంకటగిరి, మే 31 ప్రభాతవార్త : ఎంపీడీవోగా కోటేశ్వరరావు విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ఎంపీడీవో కోటేశ్వరరావు పదవి విరమణ చేసిన సందర్భంగా ఆయన అభినందన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నలభై సంవత్సరాలు పాటు ఆయన విధులు నిర్వహించగా ఒక్క వెంకటగిరిలోనే ఇరవై సంవత్సరాలు పని చేశారని తెలిపారు. ఎంపీపీ తనూజ రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో కోటేశ్వరరావు మృదు స్వభావని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కె వి కె ప్రసాద్ నాయుడు, కావాలి డిఎల్డిఓ విజయ్ కుమార్, బాలాయపల్లి డిప్యూటీ తాసిల్దార్ డీజే వినీల్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుధాకర్, పెంచలయ్య విశ్రాంతి ఉద్యోగులు చంగల్ రాయలు, తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులతో యువకుడు ఆత్మహత్యాయత్నం!

కోట, మే 31 ప్రభాతవార్త : మండలం రాఘవాపురానికి చెందిన మహేష్ అనే యువకుడు గూడూరులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ప్రస్తుతం నాయుడుపేటలో మరో కంపెనీలో ఉద్యోగానికి చేరాడు. అయితే గతంలో గూడూరులో పనిచేసిన కంపెనీ మేనేజర్ తన కుమారుడు మహేష్‌పై కస్టమర్ల ఇన్సురెన్స్ క్లయిమ్ స్వాహా చేశాడని ఆరోపణలు చేయడంతో అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం తన కుమారుడు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు న్యాయం చేయాలంటూ మహేష్ తండ్రి మస్తానయ్య పోలీసులను వేడుకున్నాడు. గత 8 నెలల క్రితం మహేష్ గూడూరులో ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తున్న సమయంలోనే క్లయింట్ల సొమ్మును చెల్లించేశాడని మస్తానయ్య తెలిపారు. అయినప్పటికీ ఆ కంపెనీ మేనేజర్ నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మే 27వ తేదీన తన కుమారుడు పురుగుల మందు తాగాడని చెప్పారు. ఈ విషయంపై కోట ఎస్ఐ పవన్‌కుమార్‌ను 'ప్రభాతవార్త' వివరణ కోరగా సమగ్రంగా విచారణ చేస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దొరవారి సత్రం,మే 31 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎన్ఎం అగ్రహారం సమీపంలో జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు చోటు చేసుకున్నాయి స్థానిక వివరాల మేరకు శ్రీకాళహస్తికి చెందిన రమేష్,అవంతికలుగా గుర్తించారు.డివి సత్రం సమీపంలోని సూరవు అగ్రహారం లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ప్రయాణంలో వెళ్తుండగా వెనక వైపు నుండి వస్తున్న కారు ఢీ కొనడంతో రమేష్‌కు తీవ్ర గాయాలు చోటు చేసుకున్నాయి. డివి సత్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజలు చట్టాలు గురించి తెలుసుకోవాలి




కోట,మే 31 ప్రభాతవార్త : సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను గురించి తెలుసుకోవాలని మండల తహిశీల్దార్, కె.జయజయరావు అన్నారు. శనివారం మండలంలోని తిన్నెల పూడి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్స నిర్వహించారు. ఈసందర్భంగా తహ శీల్దార్ మాట్లాడు తూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలన్నారు. కుల,మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల స్నేహ భావంతో ఉండాలని సూచించారు.

## హామీలను తుంగలో తొక్కేసిన బాబు : నేదురుమల్లి

వాకాడు, మే 31 ప్రభాతవార్త: ఎన్నికలో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నో పథకాలను ఇస్తామని చెప్పి, ఆ పథకాలను తుంగలో తొక్కేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని వైఎస్ఆర్సిపి వెంకటగిరి నియోజవర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం వాకాడులోని ఆయన నివాస గృహంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి సంవత్సరం కావస్తున్న సందర్భంగా వచ్చే నెల నాలుగో తేదీన 175 నియోజక వర్గాలలో వెన్ను పోటు దినం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి, వాకాడు పాపారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసి మాజీ డైరెక్టర్ వాకాటి జనార్దన్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెళ్లూరు కోటేశ్వర్‌రెడ్డి, కోట, వాకాడు, చిట్టమూరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ముద్దాయి అరెస్ట్

రేణిగుంట, మే 31 ప్రభాతవార్త : రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్లో శుక్రవారం నమోదైన పోక్సో కేసులో ముద్దాయి ప్రసన్నకుమార్ (38)ని శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. కరకంబాడి అభిరుచి హోటల్ వద్ద ఒంటరిగా ఉన్న దళిత యువతిని లైంగికంగా వేధించినందుకు కిరణ్ కుమార్‌పై అర్బన్ పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసిన విషయం విధితమే. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి సిబ్బందితో నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రేణిగుంట మండలం కరకంబాడి రైల్వే గేటు సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద ప్రసన్నకుమార్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.

## ఏపీవోకు ఘనమైన వీడ్కోలు



పెళ్లకూరు, మే 31 ప్రభాతవార్త : మండలంలో ఏపీవోగా పనిచేస్తున్న వల్లూరు దయానంద్ కు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంపీడీవో ప్రమీల రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో మండలంలోని అన్ని పంచాయతీల నుంచి రాజకీయ నాయకులు ప్రజలు తో పాటు టిడిపి మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య బిజెపి మండలాధ్యక్షుడు కలిచేటి నరసింహులు మరియు ప్రసాద్‌నాయుడు. శివకుమార్,కేవీనాయుడు. పోలయ్య నాయకులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తలచే వికసిత కృషి సంకల్ప అభియాన్



వెంకటగిరి, మే 31 ప్రభాతవార్త : కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి శాస్త్రవేత్తలు వెంకటగిరి మండలంలోని యాతలూరు, మన్నే గుంట, బంగారుపేట గ్రామాలలో రైతుల కొరకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 3 బృందాలుగా భారతీయ వరిపరిశోధన సంస్థ శాస్త్రవేత్త లతో కలిసి రైతులతో పరస్పర ముఖాముఖి ప్రత్యక్ష పరస్పర చేర్చా కార్యక్రమాలను మరియు సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే, శాస్త్రవేత్తలు, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## స్మశాన స్థలాన్ని పరిశీలించిన తహశీల్దార్



బాలాయపల్లి, మే 31 ప్రభాతవార్త: మండలంలోని మన్నూరు స్మశాన స్థలాన్ని తహశీల్దార్ విజయలక్ష్మి పరిశీలించారు. స్మశాన స్థలానికి సంబంధించిన సర్వే నెంబర్ 682 హద్దులు కేటాయించి గిరిజన యొక్క సమస్యను పరిష్కరిస్తామని తాసిల్దార్ తెలిపారు. స్థానిక గిరిజనలు వారి యొక్క స్మశాన సమస్యను పరిష్కరించేందుకు కృషిచేసిన తిరుపతి జిల్లా అధ్యక్షుడు, తలపల చెంచు మల్లికార్జున రావుకి, తహశీల్దార్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, విఆర్ఓ, మన్నూరు గిరిజనులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లోనే ప్రజలకు బియ్యం

వాకాడు, మే 31 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా ఏర్పాటుచేసిన రేషన్ షాపులోనే ప్రజలకు నిత్యవసర సరుకులుతో పాటు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తహశీల్దార్ రామయ్య అన్నారు. మండలంలోని 30 రేషన్ షాపులు 15 రోజులు అందుబాటులో ఉంటాయని, డీలర్ వద్ద ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ అన్నారు. రేషన్ షాపుల వద్ద ఎప్పటికప్పుడు వీఆర్వోలు, వీఆర్ఏలు నిఘా ఉంటారని సూచించారు.

## హక్కులపై అవగాహన కలిగి ఉండాలి




ఓజిలి, మే 31 ప్రభాతవార్త: రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగా హన కలిగి ఉండాలని ఓజిలి తహశీల్దార్ పద్మావతి పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమె తెలియజేశారు. సర్పంచ్ గోవింద సుధా ఆధ్వర్యంలో పెద్ద పరియ రాచపాళెం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఓజిలి ఎస్సై కె.స్వప్న, ఉప సర్పంచ్ వెంకటరమణరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, ఆర్ఆర్ఐ విజయ్‌కుమార్,గోవిందు పోలయ్య, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, మోహన్‌రాజు, ఎస్సీ ఎస్టీ మెంబర్స్ అరవ పార్వతయ్య, పెంచలయ్య గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్‌గా భాను ప్రకాష్‌రెడ్డి



గూడూరు, మే 31 ప్రభాతవార్త : డివిజన్ ఇంచార్జ్ కలెక్టర్‌గా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారి కె.భానుప్రకాష్‌రెడ్డి శనివారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా జూన్ 21 వరకు సెలవుపై వెళ్లారు. దీంతో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ భానుప్రకాష్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## సూర్యప్రభ వాహనంపై విహరించిన వరదుడు



యాదమరి, మే 31 ప్రభాతవార్త: యాదమరి శ్రీవరదరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వరదుడు సూర్యప్రభ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో వేదపండితులు స్వాముల వారికి పుష్పకైంకర్యాలు నిర్వహించి అభిషేకం అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించి సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో తీసుకువచ్చి ఊరేగించారు. అలాగే రాత్రి శేషవాహనంపై స్వామి విహరించి భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి వారిని భక్తులు కర్పూర హారతులతో స్వాగతించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడవాహనంపై స్వామి ఊరేగనున్నారు.

# హస్తకళల కళాకారుల సమస్యలు పరిష్కరించండి



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త : నియోజకవర్గం కళలు కళాకారులకు నిలయమని అయితే ఇక్కడ కళాకారులు సవాలక్ష సమస్యలు ఎదుర్కొం టున్నారని కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. శ్రీకాళహస్తిలోని మాధవ మాలలో కామన్ ఫెసిలిటి సర్వీస్ సెంటర్‌ను, చెర్లోపల్లి సమీపంలో కలంకారి క్లస్టర్‌ను ఏర్పాటు చేసారని అయితే అక్కడ పరిస్థితి దయనీయంగా ఉందని వాపోతు న్నారు. కొయ్యబొమ్మల తయారి, కలంకారి కళారులకు కనీస సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.ఈ మేరకు ఇటీవల మాధవమాలలోని సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొయ్యబొమ్మల కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ లేపాక్షి హస్తకళల డైరెక్టర్ డాక్టర్ గుమ్మడిపూడి దరశరాధాచ్చారి వివరించారు.

**కనీస సదుపాయాలు కల్పించండి:**

హస్తకళ కారులకు కనీస సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. 50 సంవత్సరాలరు పైబడ్డ కళాకారులకు వృద్ధాప్యపు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఇక గతంలో ప్రయాణ రాయితి ఉండేదని ప్రస్తుతం లేదని ఆర్‌టిసి బస్సుల్లో రైళ్ళలో మినహాయింపు పాస్‌లు మంజూరు చేయాలని కోరారు. ఇక కామన్ ఫెసిలిటి సెంటర్లు ఏర్పాటు చేసారని అక్కడ యంత్ర సదుపాయాల్లేదని వాపోతున్నారు. దారుశిల్పాలను తయారు చేయటానికి ముడి కొయ్య కొనుగోలుకు ప్రత్యేక డిపో ఏర్పాటు చేయాలన్నారు. ఎర్రచందనం కొయ్యను కళాకారులకు రేషన్ విధానంలో సరఫరా చేయాలని కోరారు. దారుశిల్పులు తయారు చేసిన ఉత్పత్తులను డైరెక్టు సెల్స్ కోసం తిరుమల,శ్రీకాళహస్తి, ఎయిర్‌పోర్టుల్లో ప్రత్యేక షోరూంలు ఏర్పాటు చేయాలని కోరారు. బొమ్మల తయారికి చిన్న చిన్న యంత్రాలను అందు బాటులో ఉంచాలన్నారు. అలాగే టిటిడి కళ్యాణ మండపాల్లో వివాహాలు లేని సమయంలో ఉత్పత్తులను అమ్ముకోవటానికి అనుమతించాలని కోరారు.కర్లపూడిలో ఉన్నటు వంటి కొయ్యలక్క పిడతల కళాకారులు 30మందికి పరికరాలు ఇచ్చారని అయితే వాటికి మోటార్లు లేదన్నారు. జిల్లాలోని హస్తకళల కళాకారులకు ఆర్టిజన్ క్రెడిట్ కార్డులను ఇవ్వాలని, పిఎంఈజిపి రుణాలను ఎలాంటి సెక్యూరిటి లేకుండా అందించాలని దశరథాచ్చారి కోరారు. గతంలో ఆదరణ పథకానికి ఎంతో ఆదరణ ఉండేదని అలాంటిది గత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దానిని పునరుద్ధరించాలని కోరారు. రాష్ట్రంలో 2020 వరకు హస్తకళాకారులకు అవార్డులు అందించే వారని కానీ అ విధానాన్ని రద్దు చేసారని దానిని పునరుద్దరించి కళాకారులను ప్రోత్సహించాలని కోరుతున్నారు. కొయ్యబొమ్మల కళాకారుల అభివృద్ధికి ఎంఎస్ఎంఈ సిడిపి అనే ప్రోగ్రాం నుంచి తిరుపతి జిల్లాలో అమలు చేయాలని కోరారు.

## శిల్పారామంలో సమ్మర్ క్యాంప్ విజయవంతం



తిరుచానూరు, మే 31 ప్రభాతవార్త : తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సమ్మర్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. సమ్మర్ సమ్మర్ క్యాంప్ విజయవంతం కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు, హస్తకళ ప్రదర్శన, నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏవో సుధాకర్ సమాచారం మేరకు మే ఒకటవ తారీకు నుండి 31వ తారీకు వరకు శిల్పారామం సమ్మర్ కార్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో సుమారు 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిబిరంలో మట్టి బాణాలు తయారీ, మట్టి బొమ్మలు తయారీ, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, డ్రాయింగ్, పెయింటింగ్‌లలో శిక్షణ ఇచ్చారు. శిబిరం ముగిసిన సందర్భంగా విద్యార్థులు తమ శిక్షణలో నేర్చుకున్న నృత్యరూపాలు, డ్రాయింగులు మట్టి పనులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వస్తువులను వారి తల్లిదండ్రులు సందర్శకులకు ప్రదర్శనలు చేపట్టారు. శిల్పారామం, తిరుపతి పరిపాలన అధికారి సుధాకర్ విద్యార్థులకు ప్రమాణపత్రాలు పంపిణీ చేసి, వారిని అభినందించారు. అదేవిధంగా ఈ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల సంరక్షణ మరియు నిర్వహణ బాధ్యతలు నిర్వహించిన శిల్పారామం సిబ్బంది రేష్మా, లావణ్య, పప్పిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

## స్వయం శక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన



తిరుపతిరూరల్, మే 31 ప్రభాతవార్త: స్వయం శక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన పంచాయతీలలో సంఘాలకు లాభదాయకమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. శనివారం వైజాగ్‌లో జరిగిన ఎంపిక చేయబడిన సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ అధ్యక్షులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీ గ్రామ సర్పంచ్ చెందెలి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ హాజరుగా, మండల పరిషత్ అధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎంపిడిఓ రామచంద్ర పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయంశక్తి సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఈ సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్ సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ క్రిష్ణతేజ, జడ్పిసిఇవోలు, డిపివోలు, ఎంపిడివోలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, మే 31 ప్రభాతవార్త : నారాయణవనంలోని కళ్యాణ వెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మ వారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, మూర్తి, మురళి, అర్చకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ నీటి పైపులను ధ్వంసం చేసినా మీకు పట్టదా!

### -మున్సిపల్ అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్

పలమనేరు,మే 31 ప్రభాతవార్త: కాలువపల్లె వైఎస్ఆర్ జలాశయం నుండి పలమనేరు మున్సిపాలిటీకి సరఫరా చేసే నీటి పైపులను ఓ వ్యక్తి ధ్వంసం చేసి ఆ ప్రాంతం ఆక్రమించి నిర్మాణం చేపట్టినప్పటికి మున్సిపల్ అధికారులు ఎందుకు వారిపై చర్యలు తీసుకోలేదని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ కోదండరామయ్య మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు.శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.ఈ మేరకు కౌన్సిల్‌లో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలపడం జరిగింది.ఈ క్రమంలో కౌన్సిలర్ కోదండరామయ్య మాట్లాడుతూ కాలువపల్లె వైఎస్ఆర్ జలాశయం నుండి పలమనేరు మున్సిపాలిటీకి నీటిని తరలించడానికి పైపులైన్లను ఏర్పాటు చేశారు. అయితే పట్టణ సమీపంలోని గుడియాత్తం పెట్రోల్ బంకు వద్ద ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టే క్రమంలో నీటి పైపును ధ్వంసం చేశారని ఇప్పటి వరకు వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ మురళీ మాట్లాడుతూ ఆర్టీసి బస్టాండ్ అప్పటి పంచాయితీ ద్వారా భూమి ఇవ్వడం జరిగిందని అయితే ప్రస్తుతం ఆర్టీసి బస్టాండ్‌లో బస్సులు నిలపడానికి సైతం స్థలం లేకుండా నాలుగు వైపుల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారని దీంతో బస్సుల రాకపోకలు ఇబ్బందిగా ఉందని ఆర్టీసి బస్టాండ్ కోసం భూములు ఇస్తే వారు దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కౌన్సిలర్ కిరణ్ మాట్లాడుతూ పట్టణంలోని శనేశ్వరాలయం వద్ద బ్రిటీష్ కాలం నాటి నుండి ఉన్న దారిని కొందురు ఆక్రమించారని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. కౌన్సిలర్ శ్యామ్‌సుందర్ రాజ్ మాట్లాడుతూ రాధాబంగ్లా ప్రాంతంలో గత 4 సంవత్సరాలుగా విద్యుత్ లోఓల్టేజ్ సమస్య ఉందని ఇదివరకు పలు మార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికి ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి,పలు శాఖల అధికారులు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుని కుటుంబానికి ఆర్థిక సాయం



శ్రీకాళహస్తి,మే 31 ప్రభాతవార్త : తొట్టంబేడు మండలంలో సుమారు 20 సంవత్సరాలుగా పాత్రికేయుడుగా పనిచేస్తూ మృతి చెందిన చిట్టత్తూరు మెహర్ కుటుంబానికి శనివారం సామాజిక కార్యకర్త, ఎపి డబ్ల్యుజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎల్లంపాటి కోటేశ్వరబాబు ఆర్థిక సహాయం అందించారు. మృతుని తల్లిని పరామర్శించారు. విధి నిర్వహణలో జవాబుదారి తనంతో పనిచేసిన మెహర్ కుమార్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావటంలో ముందు వరుసలో నిలిచారన్నారు. మేమంతా మీ బిడ్డలమని మీకు అండగా ఉంటామని, ఏ సమయంలో ఏ సహాయం కావాలన్నా ముందుంటామని వివరించారు. మంచి హృదయం, నిశ్వార్థ సేలందించిన ఓ మంచి జర్నలిస్టును కోల్పోయామన్నారు. ఆయనతో పాటు విసి వెంకటయ్య, యాసీన్, బాలసుబ్రమణ్యం, జాకీర్, హిమబిందు, సుమన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.